
# కార్యసాధకుడు

సుస్మితా రమణమూర్తి



"గుడ్ మార్నింగ్, సార్!"

"వెరీ గుడ్ మార్నింగ్! ఏం కావాలి మీకు?" అంతవరకు చూస్తున్న ఫైలు మూసేస్తూ ఎదురుగా నిలబడి ఉన్న రాజారావు వేపు తీక్షణంగా చూస్తూ అడిగారు ఆఫీసు సూపరెంట్ (ఒ.ఎస్.) రమణయ్య పంతులుగారు.

"అటెండెన్స్ పుస్తకం..."

"ఓహో! మీరు ఆఫీసుకి వచ్చారన్న మాట? ఇంతకీ ఇప్పుడు టైమెంతైందండీ?"

"సైకిలు మధ్యలో ట్రబులిచ్చిందండీ! అందుకే పదిహేను నిముషాలు లేటైంది."

"తప్పు మీది కాదు. మీ సైకిల్దన్న మాట? చూడండీ, రాజారావుగారూ! రేపో మాపో బాధ్యత గల ఒ.ఎస్. ప్రమోషన్ అందుకోబోతున్నారు కదా? అలాంటిది మీరే ఇలాంటి సిల్లీ రీజన్సు చెప్పడం ఏమీ బాగాలేదండీ! మొక్కై వంగనిది. మానై వంగుతుందంటారా? అలాంటిదే మన అలవాటు కూడాను. ఎనీ హౌ మీకు ఏబ్సెంట్ వేసి రిజిస్టర్ ఆఫీసర్‌కి పంపించేశాను. సెలవు కాగితం ఇచ్చేసి దయచేయండి" అంటూ, సీరియస్‌గా సీట్లోంచి లేచిపోయారు తను.

రాజారావు ముఖం ఆ సమాధానంతో నల్లబడిపోయింది.

స్టాఫంతా సానుభూతిగా తనవేపే చూస్తుండటంతో లోలోపల మరింత బాధపడుతూ సెలవు కాగితం రాసి ఒ.ఎస్. బల్లమీద పెట్టి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు తను.

రాజారావు వెళ్ళిపోయిం తర్వాత ఒ.ఎస్. తను చేసిన ఘనకార్యానికి మురిసిపోతూ, సెలవు కాగితంమీద ఓ పొట్టి సంతకం పడేశారు.


×× ×× ××

"ఎప్పుడూ లేంది మన పంతుల్లో ఈమధ్య ఇంత మార్పొచ్చేసిం దేమిటి? కొత్త-పాత తేడా లేకుండా మరీ విజృంభించేస్తున్నాడు గురుడు! రెండ్రోజులు సెలవు కావాలని మన వేణు ప్రాధేయపడ్డా స సేమిరా వీల్లేదనేశాడు మొన్నటికి మొన్న. నిన్నటికి నిన్న పాపం ఆడదన్న ఇంగితజ్ఞానం లేకుండా ఆ సుందరిని మగాడికంటే ఎక్కువగా దులిపి పారేశాడు. వేడెక్కిపోడానికైనా ఓ హద్దు పద్దూ ఉండాలి. ఆవిడ చేసిన తప్పేమిటి? టైపుచేసిన కాగితాలు గురుడు సీట్లో లేనప్పుడు తన టేబులుపై ఉంచడం నేరమా? ఆ తర్వాత పరిసరాల్ని పట్టించుకోకుండా తుమ్మడం. నశ్యపు తుంపరులతో ఆ పేపర్లు పాడవడంలో-ఆవిడదే తప్పంటూ ఎగిరెగిరి పడ్తాడా? రీ టైపింగ్ చేయమని ఆ కాగితాల్ని ఉండలా చేసి ఆవిడ ముఖంమీదకి విసిరి కొడ్తాడా? వీడి జులుం రోజురోజుకీ పెరిగిపోతోంది..."

"బాబూ బాల్జీ! ఈ విషయాలు అందరికీ తెలిసినవే కదా? కంఠశోష ఎందుకు చెప్పూ?" వేణు.

"నిమ్మకు నీరెత్తినట్లు మీలాంటి వాళ్ళుండబట్టే రాజారావుగారి లాంటి సీనియర్‌మీద కూడా ఈరోజు ధ్వజమెత్తాడు వాడు. ఎలాగోలా అందరం కలిసి వాడి ఆట మనం కట్టించకపోతే వాడి ఆగడాలు మరీ శ్రుతిమించిపోతాయ్. చీటికీ మాటికీ చీవాట్లు అక్షింతలు వేసుకోడానిక్కాదు మనం వస్తోం దిక్కడకు. మొక్కలోనే వీణ్ణి, వీడి ఆటల్ని నేలరా సేయాలి." బాల్జీ.

"వాడి దృష్టిలో పడని నీకే ఇంతిదిగా ఉంటే, వాడి చీవాట్ల అక్షింతల్లో తడిసి ముద్దయిపోయిన మాకెంత బాధగా ఉంటుందో ఆలోచించి చూడు. అయినా, అందరం ఎందుకు నోరు మూసుకుని ఉండిపోతున్నాం? ఇవి డిసెంబరు రోజులు. ఊరికే ఉద్రేకపడిపోతే ప్రయోజనం లేదు, నాయనా! వాడి వెధవచూపు, దరిద్రపు ఆలోచనలు కాన్ఫిడెన్షియల్ రిపోర్టులమీద పడిందా! మనందరి పని గోవిందా! అందుకని ఇలాంటి పరిస్థితుల్లో అందరం మన రాజారావుగారితో చర్చించి, ఆలోచించి ఏదైనా చేయడం మంచిది." కేషియర్.




14-11-84

అంతా ఆ చర్చ రేపటి రాజారావు రాకకోసం వాయిదా వేశారు.

×× ×× ××

"రిపోర్ట్సు పాడుచేస్తాడని భయపడ్డం దేని కండీ? వీడు రాసింది, చేసింది పూర్తిగా చెల్లిపోతుందా? సెక్షన్ ఆఫీసరంటూ ఒక డున్నాడు కదా?!"

"బాబూ, వేణూ! అన్ని విషయాలు మన రాజారావుగారు ఆలోచించి ఏం చేస్తే బాగా ఉంటుందో చెప్తారు కాస్త ఓపిక పట్టు." కేషియర్.

"ఇదివరకు గంట, రెండు గంటలు లేటుగా వచ్చినా, ఎవ రెలా సెలవు వాడుకున్నా చూసీ చూడనట్లుంటూ అందరితో మంచిగా ఉండే గురుడిలో ఈమధ్య అకస్మాత్తుగా ఈ మార్పు రావడంలోని అసలు కిటుకు గురించి మీకు తెలియకే తలోక రకంగా మాట్లాడుతున్నారు." రాజారావు.

"కిటుకా!? ఏమి టది!" అంటూ అంతా ఆశ్చర్యపోసాగారు.

"మనకు కొత్తగా సెక్షన్ ఆఫీసరు వచ్చి ఎన్నాళ్ళవుతోంది?"

"సుమారు నెల రోజు లవుతోంది."

"మన పంతులుగారిలో మార్పొచ్చి ఎన్నాళ్ళవుతోంది?"

"ఓ రెండు వారాల్నుం చనుకుంటాను. ఇంతకీ ఈ రెంటికీ సంబంధ మేమిటి!?"

"ఆ విషయానికే వస్తున్నాను. కాస్త ఓపిక పట్టు. మన సెక్ష నాఫీసరూ, పంతులూ పూర్వాశ్రమంలో ఒకరి కొకరు బాగా తెల్సున్నవాళ్ళు. ఒకరి మాటంటే మరొకరికి బాగా గురి ఉన్నవారు. ఇప్పుడు ఆలోచించండి. ఏం చేయాలో?" అంటూ తనకు తెలిసిన విషయం రాజారావు బయటపెట్టడంతో అంతా ముక్కుమీద వేలేసుకుని మరీ ఆశ్చర్యపోసాగారు.

"ఏం చేయాలో నన్ను చెప్పమంటారా? లేక చేసి చూపించమంటారా?"

ఆ ప్రశ్నార్థకాల ఆఫీసు బంట్రోతు అప్పడివేపు వింతగా చూడసాగా రంతా.

"ఏంట్రా! నీ బుర్రకూడా అమోఘంగా పన్జేస్తోం దేమిటి!? నీ వేమీ చెయ్యొద్దు గాని- అదేదో చెప్పేడు." కేషియర్.

"ఇటీజ్ యమా సింపులండీ! గురుడి స్కూటర్ సీట్లో, చక్రాలో కోసేస్తే సరి! ఆ దెబ్బతో వాణ్ణి పట్టుకున్న దెయ్యం వదిలేస్తుంది. మళ్ళీ మామూలైపోతాడు! ఎలాగుందండీ మన అయిడియా?" అంతా తనని మెచ్చుకుంటారన్న ఆశతో పొంగిపోతూ చెప్పాడు అప్పడు.

"నాయనా అప్పిగా! నీ అయిడియాల సంగతి తెల్సే చెప్పేడ్వ మన్నాను.

నీ అయిడియా బ్రహ్మాండంగా ఉంది గాని, దాన్ని మాత్రం ఎప్పుడూ ఇక్కడ ఎవరిమీదా ప్రయోగించకు." కేషియర్ విసుగ్గా అన్నాడు.

ఎదురుచూడని సమాధానంకి అప్పడు నీరుగారిపోయాడు.

"పోనీ గురుణ్ణి శంకరగిరి మాన్యాలకు పట్టించేసేనో?" టైపిస్టు.

"ఆలోచన దివ్యంగా ఉందిగాని, అంత అవసరమా అని ఈ పరిస్థితుల్లో?...అంత అర్జంటుగా ట్రాన్స్ఫర్ చేయించడమంటే మనవల్ల అయ్యే పని కాదే? పెద్దవాళ్ళు పూనుకుంటే గానీ జరగని పనిది!" రాజారావు.

"వారి అయిడియా మీకు నచ్చింది కదా? ఆ తర్వాత పని మనవల్ల కాకపోయినా, నాకు తెల్సిన ఓ శాల్తీ సహాయం తీసుకుంటే మన పని జరిగిపోతుందని నా నమ్మకం. రాజారావుగారూ! ఈ సాయంత్రం మీరు నాతో రండి. అన్ని విషయాలూ ఆ శాల్తీకి చెప్పి మనపని జరిగేలా చేద్దాం!" వేణు.

"ట్రాన్స్ఫ రంటే అంత తేలికైన విషయం కాదు. హెడ్డాఫీసులో బాగా పలుకుబడి ఉంటేగాని జరగనిపని." కేషియర్.

"ఆ సంగతి నాకు తెల్సండీ! ఆ శాల్తీని తక్కువగా అంచనా వేయలేం! ఇలాంటివి చాలా చేశాడని విన్నాను. ఓ విషయంలో మాబంధువు దగ్గర రెండువేల రూపాయలు తీసుకుని తనకు కావాల్సిన చోటుకి ట్రాన్స్ఫర్ ఆర్డర్ రప్పించాడు కూడాను."

"ఇది డబ్బుతోకూడిన వ్యవహారం! రెండు వేలంటే మాటలా!?...బాగా ఆలోచించాల్సిన విషయం! మనమంతా పట్టుమని పాతికమందిమి లేము— ఎంతో కొంత వేసుకుని పని జరిపించుకుందా మన్నా!" కేషియర్.

"ఈమాత్రం దానికి ట్రాన్స్ఫర్ దాకా పోవాలా అని?..." రాజారావు సందేహంగా.

"లేకపో తేమిటండీ? ఈ వెధవ దరిద్రాన్ని రోజూ ఎవడు భరిస్తాడండీ?" అప్పడు.

ఇంచుమించంతా అప్పణ్ణి సమర్థించారు.

"డబ్బు సమ స్యెలా?" కేషియర్.

"కేషియర్వి కదా? నీవే ఏదో మార్గం చూపించాలి!" వేణు.

"మా భలేగా ఉందే వ్యవహారం! డబ్బున్న షావుకారిని కాదయ్యా, బాబూ, నేను! ఆ డబ్బే గన్క ఉంటే వ్యాపారం పెట్టుకొందును."

"అంతా ఓ అభిప్రాయానికి వచ్చారు కాబట్టి ఆ గురుణ్ణి కలిసి చూద్దాం. మన వ్యవహారం చక్కబెట్టగలడంటే-ఎంతదవుద్దో చెప్తాడు కదా? అప్పుడు ఆలోచిద్దాం డబ్బు సంగతి!" రాజారావు.

"అలా చేయండి, బాబూ! అన్ని కేసులికీ ఒకే రేటంటా డేమిటి?" అప్పడు.

"మన లంచ్ అవర్ పూర్తి కావస్తోంది. మన గురుడు వచ్చే టైమ్ కూడా దగ్గర పడింది. పదండి సెక్షన్లోకి పోదాం!" అంటూ ఒక రనేసరికి, అంతా బుద్ధిగా సెక్షన్వేపు దారి తీశారు.

×× ×× ××

"తను లేట్గా వచ్చినా, తన మెడికల్ ఎక్స్పెండిచర్ ఎక్కువైనా, కావాల్సినప్పుడు లీవు తీసుకున్నా, ఇతరత్రా సొంత పనులు ఆఫీసు సమయంలో చేసుకుంటున్నా-చేయించుకుంటున్నా ఎవ్వరూ వేలెత్తి చూపించలేని సీట్లో ఉన్నాడు మీ పంతులు. పై ఆఫీసర్ మీ గురుడికి స్నేహితుడు. నన్నిహితుడు కాబట్టి తను చెప్పిందే వేదంలా ఉందంటారు పరిస్థితి!"

"అవునండీ!" రాజారావు.

"గంగిగోవులాంటి మనిషి ఈ కొత్త ఆఫీసర్ అండ చూసుకుని పోట్లగిత్తలా మారిపోయా డంటారు?"

"అవునండీ!" వేణు.

"బాబూ, వేణూ! మీ తమ్ముడికి కాన్వెంట్లో సీటిప్పించి పుణ్యం కట్టుకున్నది ఈ రాజారావుగ రేనా?..."

"అబ్బా!! క్రిందటి సంవత్సరం విషయం మీకింకా గుర్తుందన్న మాట!?"

"మంచివాళ్ళు చేసే మంచి పనుల్ని, ఆ మంచి మనుమల్ని ఎవరైనా ఎలా మరచిపోత రు, బాబూ? అందునా నీలాంటి అవసరమే నాకూ ఎదురైం దిప్పుడు. నా పెద్ద మనమణ్ణి ఆ కాన్వెంట్లోనే చేర్పించాల నుంది. సరైన సమయంలోనే మన రాజారావుగారి దర్శనమైంది నాకు. ఆ ప్రిన్సిపాల్గార్కి వీరికి ఉన్న స్నేహం ఈనాటిది కాదని విన్నాను. వీరు తల్చుకుంటే మావాడికి ఆ కాన్వెంట్లో నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకోడానికి అవకాశం తప్పక ఉంటుందనీ తెల్సు!"

'నిజంగా ఈ ముసలాడి బుర్ర పాదరసంలా పన్జేస్తోందే!?... ఈ రెండింటికీ లింకు పెట్టబోతున్నాడా!?...' స్వగతంలో రాజారావు అనుకుంటూ—"చూడండీ, సలహా్రావుగారూ!..." అంటూ ఏదో చెప్పబోతుంటే—"అయ్యా! నా పేరు బ్రహ్మానందమండీ! నా దగ్గరకు వచ్చినవాళ్ళకు నాకు తోచిన సలహాలేవో ఇస్తూండటం, చాలామందికి నా సలహాలమూలంగా పనులు జరిగిపోతుండటంవల్ల నా పేరుని జనాలు మార్చేశారు" అంటూ సదరు బ్రహ్మానందం నవ్వేస్తూ తన సోది వినిపించాడు.

"సర్లెండి! మీవాడి సీటు విషయం నే చూసుకుంటాను. మరి మా గురుడి విషయం గురించి మీరు గట్టిగా ప్రయత్నించాలి." రాజారావు.

"అంతగా చెప్పాలటండీ? నా సంగతి మీకూ మీ సంగతి నాకూ పూర్తిగా తెలీకపోయినా, మన మధ్యలో ఈ వేణు ఉన్నాడు కాబట్టి బాగా ఆలోచించి మీ విషయం గురించి చెబ్తాను."

"ఆలోచించి చెప్తా ననడం కాదండీ! పని జరుగుతుందని హామీ ఇస్తే మాక్కాస్త మనశ్శాంతిగా ఉంటుంది."

"బాగా శ్రమతో కూడిన వ్యవహారంవండీ మీది! నా విషయంలో మీరు హామీ ఇచ్చారు కాబట్టి మీ పని సానుకూలపర్చేందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఇంతకీ మీ స్టాఫెంతమంది?"

"ఇరవైదాకా ఉంటారు."

"ఇరవై యాభైలు ఎంతండీ?"

"వెయ్యి." వేణు.

"అదండీ సంగతి! అంతైతే మీ గురుణ్ణి మళ్ళీ గంగిగోవులా మార్చేయడవో లేదా మరేక పేడైనా చేసి వాడితో గొడవ లేకుండా చేయడవో చేస్తాను. ఏవంటారు?"

"మనకిక ముసుగులో గుద్దులాట దేనికండీ? మీ పని చేస్తాను. మా పని మీరు చూడండి."

"అలా అనేస్తే ఎలాగండీ? హెడ్డాఫీసుతో ముడిపడ్డ మీ పనికీ, ఈ ఊర్లో కేవలం మీ మాటతో జరిగిపోయే నా పనికి ముడి పెట్టడం అంత సబబుగా లేదండీ?"

"సరే! నా అభిప్రాయం చెప్పాను. మరి మీ అభిప్రాయం సెలవివ్వండి."

"అలా అన్నారు బావుంది. మీ హెడ్డాఫీసుకి రానుపోను ఖర్చులగ్గాను ఓ ఐదొందలు ఇవ్వండి."

కొన్ని క్షణాలు తటపటాయించి రాజారావు ఓ నిర్ణయానికొచ్చేశాడు.

"గురువుగారూ! అన్నీ దీంతోనే సరిపెట్టండి!" అంటూ మూడు వందలు ఆయన చేతిలో ఉంచి లేచి నిలుచున్నాడు.

"సరే, కానివ్వండి! కొన్ని పరిస్థితుల్లో ఒకరికొకరు ఇలా సహాయం చేసుకోవడం తప్పని సరి!" అంటూ ఆ డబ్బు తీసుకున్నాడు తను.

× × × × ×

"నాన్నగారూ! రెండేళ్ళ నుంచీ మనూరికి ట్రాన్స్ఫర్ కోసం విశ్వప్రయత్నం చేస్తున్నా కానిపని మీరు ఓ నెల్రోజుల్లో ఎలా నాకు ట్రాన్స్ఫర్ చేయించారు?" ఆశ్చర్యంతో తండ్రి ముఖంలోకి చూస్తూ అడిగాడు సదాశివం.

"నాయనా శివా! ఈ బ్రహ్మానందానికి ఆ బ్రహ్మదేవుడు కాస్త ఆలోచించే బుర్ర ఇచ్చాడ్రా! అగ్గిపుల్ల గీసి గుళ్ళో దీపాలనీ వెలిగించొచ్చు, కొంపల్నీ తగలెట్టొచ్చు. ఐతే నే నే పని చేసినా, గుళ్ళో దీపాల్ని వెలిగించేలా ఉంటుంది."

". . . "

"నీ వొకడివి ఆఫీసర్గా వాళ్ళ హెడ్డాఫీసులో ఉన్నావని, ఇక్కడికి రావడానికి విశ్వప్రయత్నం చేస్తున్నా వన్న విషయం ఇక్కడి వాళ్ళకు తెలీదు. అదో ప్లస్ పాయింటు మనకు. అక్కడి మీ బాస్ తమ్ముడి కొడుక్కి మనూర్లో వాళ్ళకు కావాల్సిన కాన్వెంటులో సీటు రాక కిందా మీదా పడుతున్నారన్న విషయం మీ చెల్లెలు రాధ ద్వారా నాకు సరైన సమయంలో అంటే ఇక్కడి పంతులు గొడవ నా చెవిలో పడ్డానికి ముందుగానే తెలియడం మరో ప్లస్ పాయింటు మనకు. ఇక మన రాధ, మీ బాస్ తమ్ముడి భార్యా ఒకప్పటి క్లాస్మేట్స్ కావడం ఈ తతంగంతో చెప్పుకోదగ్గ విశేషం!... అంతే! నీవు ఇక్కడకు సెక్షనాఫీసర్గా రావడం జరిగితే, వాళ్ళ కుర్రాడికి సీటు రావడం గారంటీ- అన్న అభయహస్తం ఎత్తాను వాళ్ళకు. ఇంకేవుంది నిమిషాలమీద అన్ని పనులూ జరిగిపోయాయ్!" ధర్మసూక్ష్మాన్ని వివరించారు బ్రహ్మానందం చిద్విలాసంగా నవ్వుతూ.

"వాళ్లకు కావాలిసింది ఆ పంతులు ట్రాన్స్ఫర్ కదా?"

"ఈ మాత్రం అర్థం చేసుకోలేనివాడివి సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం ఎలా వెలగబెడుతున్నావురా? గంగిగోవులాంటి పంతులు వాడి అండ చూసుకునేగా అలా తన పంజా విప్పాడు? వాడు లేందే మళ్ళీ పిల్లయిపోడూ?... అర్థాంతరంగా ఇక్కడి సెక్షన్ ఆఫీసర్కి ట్రాన్స్ఫర్ వచ్చేసినా, గొడవే మీ చేయకుండా బుద్ధిగా ఎందుకు ఊరుకున్నాడో తెలుసా? వాడి సొంతఊరు ఇక్కడికంటే హెడ్డాఫీసుకి బాగా దగ్గరై పోవడం వల్ల!"

"గుడ్ గేమ్... వెల్డన్, డాడీ! ఇంట్లో కూర్చునే చక్రం తిప్పేశారు. ఆ కాన్వెంట్ సీట్తో ఇన్నింటిని ముడి పెట్టేశారా!?"

"అవున్రా! ఈ వ్యవహారంలో అందరి అవసరాలూ తీరాయ్. ఇక వాళ్ళ దగ్గర తీసుకున్న ఆ మూడొందలూ మనింట్లో వారాలు చేసుకుంటూ చదువుకుంటున్న ఇద్దరికీ కాలేజీ ఫీజులు వగైరాలకి కావాల్సొచ్చాయ్. ఆ మాత్రం వాళ్ళనుంచి తీసుకోడం తప్పనిపించలేదు నాకు" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు బ్రహ్మానందం. ✱


# తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

# తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్స్లో 3 ఫైల్స్ ఒక రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (A )**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



తెలుగు సాహితీ పాఠకుల పంట!
టీనేజర్స్ (యువతీ యువకుల)
కలల పంట!
1973 సంవత్సరపు నవలగా పేరొందిన
హిమజ్వాల 1984 అద్వితీయ ముద్రణ!



1,2 భాగాలుగా
వెలువడుతోంది.
650 పేజీలు రూ.45/-
ప్రచురణకు ముందే
కొనుగోలు సౌకర్యంతో
రూ.40/- M.O. పంపి
రూ.4/- ఆదా చేయండి.
ఈసౌలభ్యం డిశంబర్ 15
వరకు మాత్రమే!
పుస్తకాలు (1,2 భాగాలు)
మిగిలిన రూపాయికి
V.P.Pలో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ-2.
ఫోన్: 74005.